సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 19-8-2024

సంపుటి: 20 సంచిక: 125

పేజీలు: 4 వెల: రూ.1




రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు రాఖీ కడుతున్న ఆయన సోదరి భవాని.
- సత్యంన్యూస్, శ్రీకాకుళం





ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీలలో(2024) బెస్ట్ అచీవ్మెంట్ అవార్డుకు శ్రీకాకుళం జిల్లా సాక్షి సీనియర్ ఫోటోగ్రాఫర్ కుప్పిలి జయశంకర్ (శ్రీముఖలింగం చక్రతీర్థ స్నానం) ఎంపికయ్యారు. గతంలో రెండుసార్లు జాతీయ అవార్డు, మూడుసార్లు రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం



2 భార్య కోసం సముద్రగర్భంలో 13 ఏళ్లుగా అన్వేషణ



3 జైలుకైనా వెళతా.. ఇంటికి మాత్రం వెళ్లను..!




4 క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట

తప్పుడు దివ్యాంగ పత్రాలతో ప్రభుత్వాన్ని చీట్ చేసి పెన్షన్లు, ఇతర ప్రయోజనాలు అందు కుంటున్నవారి సంఖ్య జిల్లాలో క్రమంగా పెరుగుతోంది. ఎప్పటికప్పుడు కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. తాజాగా జలుమూరు మండలం సైరిగాంలో ఏకంగా 33 మంది తప్పుడు సదరం ధ్రువపత్రాలతో దివ్యాంగ పెన్షన్లు అందుకుంటు న్నారని గుర్తించిన అధికారులు వైకల్య నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఎచ్చెర్ల మండలం ఇబ్రహీం బాద్‌లో చాలాకాలం నుంచి నలుగుతున్న నకిలీ పింఛన్ల వివాదం ఇప్పుడు రాజకీయ యుద్ధంగా మారింది. తప్పుడు సదరం పత్రాలతో పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తిని ఇంతవరకు కాపాడుకుంటూ వచ్చిన టీడీపీ నేతలు స్కూల్ కమిటీ ఎన్నికల్లో అతను తమకు వ్యతిరేకంగా చెయ్యి ఎత్తాడన్న అక్కసుతో పెన్షన్‌కు అనర్హుడంటూ తాజాగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెన్షన్ల పేరుతో జరుగుతున్న చీటింగ్‌లోనూ రాజకీయ ఆధిపత్యం కోసం వెంపర్లాడటం విడ్డూరం.



# చేసేది చీటింగ్.. రాజకీయ ఫైటింగ్!


MEDICAL EDUCATION DEPARTMENT

From
Dr.D.Shakeela, MD.,
Superintendent,
Govt. General Hospital,
Srikakulam.

To
The District Co-Ordinator of Hospital Services,
Srikakulam.

Rc.No.1986/M1/2024, Dt:13.08.2024


Sir,
Sub: Govt. General Hospital, Srikakulam – Genuineness of Disability Certificate belongs to Ibrahimbad Grama Panchyathi, Etcherla Mandalam, Srikakulam to attend before the O/o Superintendent, Govt. General Hospital, Srikakulam on 20.08.2024 at 10.00 AM for Medical Examination – Intimation – Request – Rrg.


Ref: Rc NO. 458/E3/DCHS/2024, Dt. 03.07.2024 of the District CO-ordinator of Hospital Services, Srikakulam.

Yours faithfully,
Superintendent,
Govt. General Hospital,
Srikakulam.



- తప్పుడు దివ్యాంగ పెన్షన్ల వివాదంలో రాజకీయం
- స్కూల్ కమిటీ ఎన్నికల్లో వ్యతిరేకించాడన్న కక్ష
- అంతకుముందు కాపాడారు.. ఇప్పుడు ఫిర్యాదు చేశారు
- పోటాపోటీగా జిల్లాయంత్రాంగానికి ఫిర్యాదుల పరంపర
- సుదీర్ఘంగా సాగుతున్న ఇబ్రహీంబాద్ వ్యవహారం




ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక (PGRS)
Public Grievance Redressal System

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌లో వైకల్యం లేకుండానే పింఛన్లు పొందుతున్న వ్యవహారం రాజకీయ వివాదంగా మారింది. ఈ పంచాయతీలో 11 మంది బోగస్ దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారంటూ మొదట ఒక వర్గం ఫిర్యాదు చేయగా, ఇప్పుడు ప్రత్యర్థివర్గం తొమ్మిదిమంది అనర్హులంటూ ఈ నెల 22న గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఇంకోవర్గం మరో ముగ్గురిపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఫిర్యాదు చేసిన రెండువర్గాలు ఇచ్చిన జాబితాల్లోనూ సువ్వారి వెంకటరమణ అనే వ్యక్తి పేరు ఉంది. మొదట అందిన ఫిర్యాదు ఆధారంగా జూలై 10న రణస్థలంలో నిర్వహించిన వైకల్య నిర్ధారణ పరీక్షలకు ఆరోపణలు ఎదుర్కొంటున్న 11 మందిలో సువ్వారి వెంకటరమణ ఒక్కరే హాజరయ్యారు. ఆయన్ను పరీక్షించిన వైద్యులు తదుపరి పరీక్షలకు రిమ్స్‌కు రావాల్సివుంటుందని సూచించి పంపేశారు. మిగతా పది మంది గ్రామానికి చెందిన కూటమి నాయకుల సహాయంతో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కలిశారు. ఆ సందర్భంగానే సువ్వారి వెంకటరమణకు పింఛను నిలిచిపోకుండా చూడాలని నాయకులు కోరారు. అయితే ఇటీవల జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికల్లో సువ్వారి వెంకటరమణ కూటమికి వ్యతిరేకంగా చేతులు ఎత్తడంతో పరిస్థితి మారిపోయింది. అంత వరకు వెంకటరమణను వెనకేసుకొచ్చిన కూటమి నాయకులు తాజాగా అతనితో సహా తొమ్మిదిమందిని బోగస్ దివ్యాంగులుగా పేర్కొంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గమ్మత్తు ఏటంటే లక్ష్మణకుమార్ అనే వ్యక్తి ద్వారా జలుమూరు మండలం కరకవలస గ్రామానికి చెందిన ఎస్వీ రమణ అనే పేరుతో కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సమర్పించారు. ఈ ఫిర్యాదులో తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడంపై ఆగ్రహించిన మరో వర్గం వేరే ముగ్గురిపై ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతోంది.

## ఎంపీడీవో రాజకీయం

రెండేళ్ల క్రితం 2022లో గ్రామంలో బోగస్ దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేశారంటూ ఇబ్రహీంబాద్ ఉపసర్పంచ్ ప్రతినిధి ప్రకాశరావు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ పంచాయతీలో సామాజిక పింఛన్లు అందుకుంటున్న వారిలో 301 మందిలో 44 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 12 మందిపై ఫిర్యాదు అందగా, రిమ్స్‌లో సదరం ధ్రువీకరణ పొందిన దిలీప్ మినహా మిగతా 11 మంది దివ్యాంగుల - మిగతా 3లో





- కొత్తగా ఎయిర్‌పోర్టు, సాగరమాల రోడ్లు, పారిశ్రామిక హబ్
- పెట్రో రిఫైనరీ కూడా మంజూరయ్యే అవకాశం
- భావనపాడు స్థానంలో అనూహ్యంగా తెరపైకి
- ఈ మార్పే సిక్కోలు పాలిట మేలిమలుపుగా మారుతోంది
- ఇప్పటికే శరవేగంగా పోర్టు నిర్మాణ పనులు

# మూలపేట.. జిల్లాకు మేలుబాట!





**పేరుకు తగ్గట్లే అది ఒక మూలన ఎవరికీ పట్టని.. అసలు తెలియనట్లు ఉన్న చిన్న గ్రామం. ఇప్పుడదే ఒక ప్రముఖ కేంద్రంగా పరిశ్రమల పుంతగా.. అభివృద్ధికి మూలస్థానంగా రూపుదిద్దుకుంటోందా? అంటే ప్రభుత్వాలు చేస్తున్న ప్రతిపాదనలు అవుననే చెబుతున్నాయి. అదే జిల్లాలోని మూలపేట. సంతబొమ్మాళి మండలంలో సముద్రతీరాన ఉన్న ఈ చిన్నగ్రామం తన స్వరూపాన్ని మార్చుకునేందుకు సిద్ధమవుతోంది. తనతో పాటు శ్రీకాకుళం జిల్లా రూపురేఖలనే మార్చే దిశగా పరుగులు తీస్తోంది. ఇప్పటికే అక్కడ నౌకాశ్రయం(పోర్టు) నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పోర్టు కార్యకలాపాలు ప్రారంభమైతే ఆ చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం పోర్టుతో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు మూలపేట వేదిక అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడే మినీ ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రియల్ హబ్, సాగరమాల ప్రాజెక్టుతో పాటు పెట్రో రిఫైనరీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఈ ప్రతిపాదనలన్నీ కార్యరూపం దాలిస్తే ఇంతకాలం వెనుకబాటుతో, వలసలతో కుంగిపోతున్న శ్రీకాకుళం జిల్లా అగ్రపథంలోకి దూసుకుపోతుందన్న ఆశాభావం జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది.**

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

కాలం కలిసొస్తే నడిచొచ్చే కొడుకు పుడతాడని అంటారు. అది ఎంతవరకు నిజమో గానీ.. వెనుకబడిన జిల్లాగా అట్టడుగున మగ్గిపోతున్న శ్రీకాకుళం జిల్లా ఒక్కసారిగా అడ్డంకులను అధిగమించి ప్రగతిపథంలో దూసుకుపోయేందుకు అనువైన పరిణామాలు శరవేగంగా చోటుచేసుకుంటున్నాయి. జిల్లావాసులకు శుభ సంకేతాలు పంపుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో గానీ సిక్కోలుది చిట్టచివరి స్థానమే. ఏమాత్రం అభివృద్ధి వాసనలు లేని ఈ జిల్లా ఒక్కటంటే ఒక్కటైనా భారీ పరిశ్రమకు నోచుకోక దశాబ్దాలుగా పేదరికం నీడలో మగ్గిపోతోంది. ఉన్న ఒక్కగానొక్క ఆమదాలవలస షుగర్ ఫ్యాక్టరీ మూతపడిపోయింది. చిన్నాచితకా పరిశ్రమలు తప్ప పెద్దగా ఉపాధి అవకాశాలు లేక జిల్లా ప్రజలు పొట్ట చేతపట్టుకుని వలసల బాట పడుతున్న దుస్థితి. దాంతో శ్రీకాకుళం వలసల జిల్లాగా పేరుపడిపోయింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేసే పేరుతో అనేక ప్రాజెక్టులు, జాతీయస్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు హామీ ఇస్తూ ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపర్చిన వాటిలో ఒక్కటి కూడా శ్రీకాకుళం జిల్లాకు దక్కలేదు. అదే చట్టంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ కూడా గాల్లో కలిసిపోయింది. ఇలా అన్నివిధాలా అన్యాయమైపోతున్న జిల్లాకు అనుకోని విధంగా మూలపేట రూపంలో అదృష్టం తలుపు తడుతోంది. వరాల మూటలు తీసుకొస్తోంది. అభివృద్ధిపై కొత్త ఆశలకు రెక్కలు తొడుగుతోంది.

## భావనపాడు స్థానంలో తెరపైకి మూలపేట

రెండేళ్ల క్రితం వరకు మూలపేట గురించి రాష్ట్రానికే కాకుండా జిల్లా ప్రజలకు కూడా సరిగ్గా తెలియదు. భావనపాడులో ప్రతిపాదించిన పోర్టు నిర్మాణాన్ని గత వైకాపా ప్రభుత్వం మూలపేటకు మార్చడంతో ఇది వెలుగులోకి వచ్చింది. భావనపాడులో పోర్టు నిర్మాణ ప్రతిపాదన దాదాపు ఐదు దశాబ్దాలనాటిది. నిర్మాణానికి కొన్ని ప్రయత్నాలు జరిగినా అవి ఫలవంతం కావని నిర్ధారణ కావడంతో నిలిపివేశారు. ఇక్కడ సముద్రం బెర్తులు నిర్మించి, నౌకలు నిలిపేందుకు అనుకూలం కాదని తెలడంతో ఇక పోర్టు రాదనుకున్నారు. కానీ గత ప్రభుత్వం నిపుణులతో అధ్యయనం చేయించి భావనపాడుకు కొద్ది దూరంలోనే ఉన్న మూలపేటలో పోర్టు నిర్మించాలని నిర్ణయించింది. స్థలం మార్పుపై చాలా వ్యతిరేకత వచ్చినా ఎట్టకేలకు పోర్టు నిర్మాణం ప్రారంభమై శరవేగంగా కొనసాగుతోంది. సముద్రంలో అలల తాకిడిని తగ్గించేందుకు బ్యాక్ వాటర్స్ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. అదే సమయంలో జాతీయ రహదారి నుంచి మూలపేట పోర్టుకు కనెక్ట్ చేసేలా రహదారుల నిర్మాణం జరుగుతోంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుకు కట్టుబడి ఉండటమే కాకుండా సాధ్యమైనంత త్వరగా పోర్టును అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తోంది. పోర్టు నిర్మాణం పూర్తి చేసుకుని కార్యకలాపాలు ప్రారంభిస్తే.. దీనికి అనుబంధంగా అనేక చిన్న పరిశ్రమలు ఏర్పాటై వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు వృద్ధి చెందుతాయి.

## మరికొన్ని ప్రాజెక్టులు

దశాబ్దాల తర్వాత సాకారమవుతున్న పోర్టుతోనే చాలా అభివృద్ధి జరుగుతుందని అనుకుంటే ఇప్పుడు దానికితోడు మరికొన్ని ప్రాజెక్టులు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదనల గురించి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రస్తావించడంతో వీటిపై ఆశలు చిగురిస్తున్నాయి.

- రాష్ట్రంలో కొత్తగా నాలుగు విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి రాష్ట్రంలో విమాన సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలోనే రాష్ట్రంలో మరో నాలుగు ఎయిర్‌పోర్టులు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నాలుగింటిలో ఒకటి శ్రీకాకుళం జిల్లా మూలపేటలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దాంతోపాటు చిత్తూరు జిల్లా కుప్పం, నెల్లూరు జిల్లా దగదుర్తి, గుంటూరు జిల్లా నాగార్జునసాగర్‌లలోనూ కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు సమావేశం అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ ప్రకటించారు.
- రాష్ట్రానికి పొడవైన సాగరతీరం ఉంది. అందులో ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే వంద కిలోమీటర్లకుపైగా తీరప్రాంతం ఉంది. తీరం పొడవునా అభివృద్ధి చేసేందుకు వీలుగా కేంద్రం ప్రతిపాదించిన సాగరమాల ప్రాజెక్టులో భాగంగా ఆరులైన్ల రోడ్లు నిర్మించనున్నారు.
- మూలపేటలో నిర్మిస్తున్న పోర్టు కారణంగా నౌకాయాన, రవాణా రంగాలకు చెందిన అనుబంధ పరిశ్రమలు వచ్చే అవకాశాలు మెండుగా ఉండగా వాటికి అదనంగా పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం - మిగతా 4లో

• ఎడిటోరియల్

# సిద్ధరామయ్య పదవికి 'ముడా' ముప్పు!

పదవిలో ఉండగా అవినీతి కేసుల్లో ఇరుక్కుని అరెస్టయిన ముఖ్యమంత్రులు దేశంలో చాలామందే ఉన్నారు. ఇప్పుడు ఆ జాబితాలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా చేరిపోతారా? కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలను చూస్తే అందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్యపై విచారణకు కర్ణాటక గవర్నర్ థ్యావర్‌చంద్ గెహ్లాట్ అనుమతి ఇవ్వడంతో ఈ రకమైన ప్రచారం ఊపందుకుంది. గవర్నర్ చర్యపై సీఎం సిద్ధరామయ్యతో పాటు కాంగ్రెస్ తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. కేంద్రంలోని మోదీ సర్కారు ఆదేశాల మేరకే గవర్నర్ ఈ అనుచిత నిర్ణయం తీసుకున్నారని, దీన్ని ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తానని సిద్ధరామయ్య ప్రకటించారు. ఈ పరిణామాలతో కర్ణాటక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్న ఫళంగా బెంగళూరుకు చేరుకుని కాంగ్రెస్ రాష్ట్ర నేతలతో మంతనాలు జరపగా, మరోవైపు కర్ణాటక కేబినెట్ అత్యవసరంగా సమావేశమై తాజా పరిణామాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై చర్చించింది. కన్నడనాట తాజా రాజకీయ వివాదానికి కేంద్ర బిందువుగా మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) మారింది. మైసూర్ ప్రాంతంలో కెసరే అనే గ్రామంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి పార్వతికి మూడెకరాల భూమి ఉండేది. అభివృద్ధి పనుల కోసం ముడా ఆ భూమిని అప్పుడెప్పుడో తీసుకుంది. దానికి పరిహారంగా 2021లో విజయనగర ప్రాంతంలో 38,288 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్లాట్లను సిద్ధరామయ్య సతీమణికి కేటాయించింది. ఇదే వివాదంగా మారింది. కెసరే ప్రాంతంతో పోలిస్తే విజయనగర ప్రాంతంలో భూములు, స్థలాల ధరలు చాలా ఎక్కువ. అటువంటి ఖరీదైన ప్రాంతంలో సీఎం సతీమణికి పరిహారం పేరుతో స్థలాలు కేటాయించడంలో అక్రమాలు జరిగాయని బీజేపీ ఆరోపిస్తోంది. దాదాపు నెలరోజులుగా రాష్ట్ర రాజకీయాలను ఈ వివాదం కుదిపివేస్తోంది. ఈ కుంభకోణంలో సీఎం పాత్రపై విచారణ జరిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సామాజిక కార్యకర్త అయిన న్యాయవాది టీజే అబ్రహం గవర్నర్‌కు పిటిషన్ అందజేయగా, ఆయన ఆమోదం తెలిపారు. గవర్నర్ నిర్ణయంతో సీఎం సిద్ధరామయ్యతో పాటు కాంగ్రెస్ కూడా అవాక్కయ్యింది. దాంతో ఎదురుదాడి ప్రారంభించింది. ఇదంతా బీజేపీ కుట్ర అని ఆరోపించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారాన్ని కోల్పోయిన బీజేపీ ఎలాగైనా మళ్లీ ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకోవాలన్న లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై గవర్నర్ ద్వారా కుట్రలకు పాల్పడుతోందని ఆరోపిస్తోంది. వాస్తవానికి తన భార్యకు భూ కేటాయింపు బీజేపీ హయాంలోనే జరిగిందని సిద్ధరామయ్య చెబుతున్నారు. తన భార్య పార్వతికి చెందిన భూమిని ముడా తీసుకుందని, దానికి ప్రత్యామ్నాయంగా మరో చోట భూమి కేటాయించాలని కోరుతూ 2014లో తాను సీఎంగా ఉన్నప్పుడే తన సతీమణి దరఖాస్తు చేసుకోగా, తాను అధికారంలో ఉన్నప్పుడు ఆ పని చేయలేనని చెప్పానని ఆయన అంటున్నారు. తిరిగి 2021లో ఆమె ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా అప్పటి బీజేపీ ప్రభుత్వమే విజయనగర ప్రాంతంలో భూమి కేటాయించిందని సిద్ధరామయ్య వాదిస్తున్నారు. గవర్నర్ చర్య అప్రజాస్వామికమని రాష్ట్ర మంత్రివర్గం అభిప్రాయపడింది. సీఎంపై విచారణకు ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాజకీయ యుద్ధంగా మారిన ఈ వివాదంలో సీఎంపై విచారణ ప్రారంభమైతే, ఆయన్ను అరెస్టు చేసే అవకాశం కూడా ఉందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అదే జరిగితే పదవిలో ఉండగా అరెస్టయిన ఐదో సీఎం ఆయనే అవుతారు. కర్ణాటకలో రెండో సీఎం అవుతారు. 2011లో బీజేపీకి చెందిన యడ్యూరప్ప ఇదే కర్ణాటక ముఖ్యమంత్రి పదవిలో ఉండగానే అరెస్టయ్యారు. అప్పట్లో బెంగళూరు ఇండస్ట్రియల్ ప్రాంతంలో భూకేటాయింపుల విషయంలో ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో లోకాయుక్త విచారణ జరిపి ప్రాథమికంగా నిర్ధారించింది. దాంతో సీఎం యడ్యూరప్పపై పూర్తిస్థాయి విచారణకు అప్పటి గవర్నర్ హన్స్‌రాజ్ భరద్వాజ్ అనుమతించారు. అదే ఏడాది అక్టోబర్‌లో లోకాయుక్త అరెస్టు వారెంట్ జారీ చేయడంతో సీఎం యడ్యూరప్పను పోలీసులు అరెస్టు చేసి 23 రోజులు జైల్లో పెట్టారు. కాగా బీహార్‌లో సంచలనం సృష్టించిన పశువుల దాణా కుంభకోణంలో 1997లో అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ వివాదం పాట్నా హైకోర్టుకు చేరగా సీబీఐ విచారణకు ఆదేశించింది. సీబీఐ దర్యాప్తు నివేదిక ఆధారంగా రాష్ట్ర గవర్నర్ ఏఆర్ కిద్వాయ్ లాలూపై కేసు నమోదు, విచారణకు అనుమతిచ్చారు. విచారణలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో లాలూను పోలీసులు అరెస్టు చేశారు. బొగ్గు గనుల కేటాయింపుల్లో రూ.400 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారన్న ఆరోపణలతో నమోదైన కేసులో 2009లో అప్పటి జార్ఖండ్ ముఖ్యమంత్రి మధుకోడాను సీబీఐ అరెస్టు చేసింది. 2012 వరకు విచారణ ఖైదీగా జైల్లో ఉన్న ఆయనకు 2017లో శిక్ష పడింది. ఇక మద్యం కుంభకోణంలో ప్రమేయం ఉందన్న ఆరోపణపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఏడాది మార్చిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగా కేజ్రీవాల్ జైల్లోనే ఉన్నారు. ఇదే కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను 2022 అక్టోబర్‌లో ఈడీ, సీబీఐలో అరెస్టు చేశాయి. అప్పటి నుంచి సుదీర్ఘ కాలం జైల్లోనే ఉన్న ఆయన ఈమధ్యే సుప్రీంకోర్టు ఉత్తర్వులతో విడుదలయ్యారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా ఆదేశాల మేరకే మద్యం కుంభకోణం విచారణ ప్రారంభమైంది.



## భార్య కోసం 13 ఏళ్లుగా సముద్రగర్భంలో

# 13 ఏళ్లుగా అన్వేషణ!

2004లో సునామీ భారతదేశాన్ని అతలాకుతలం చేస్తే, 2011లో ఆ ప్రతాపం జపాన్ మీద పడింది. పసిఫిక్ మహాసముద్రంలో భూకంపం కారణంగా అలలు ఉవ్వెత్తున ఎగిశాయి. భారీ అలలు తీరాన్ని తాకి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. జపాన్‌లో నమోదైన ప్రకృతి విపత్తుల్లో ఇది అత్యంత పెద్దది. ప్రపంచంలోని భయంకరమైన భూకంపాల్లో ఇది నాలుగోది. అలలు 133 అడుగుల ఎత్తున ఎగిసిపడి జనాన్ని నామరూపాలు లేకుండా చేశాయి. ఈ కారణంగా సుమారు 20వేల మంది మరణించగా, 6,242 మంది గాయపడ్డారు. మరో 2,533 మంది పూర్తిగా గల్లంతయ్యారు.

జపాన్ చరిత్రలో అదొక చీకటి అధ్యాయం. ఆ సమయంలో జపాన్‌లోని ఫుకుషిమా అనే పట్టణంలో సముద్రం ఒడ్డున యోకో అనే మహిళ కూర్చుంది. ఆర్ యూ ఓకే? ఐ వాంట్ టు గో హోమ్ అంటూ భర్త యాసో తకమత్సుకు తన ఫోన్ నుంచి మెసేజ్ పంపింది. కాసేపటికి ఆమె కంటి ముందు భారీ అలలు పైకి లేచాయి. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఆమె పరుగు ప్రారంభించింది. కానీ ఎంత దూరం పరిగెత్తగలదు? అలా పరుగు పెడుతూనే 'ద సునామీ ఈజ్ డిజాస్టర్' అనే మెసేజ్ టైప్ చేసింది. కానీ ఆ మెసేజ్ భర్తకు చేరలేదు. ఆ తర్వాత ఆమె ఏమైందో ఎవరికీ తెలియదు. కొన్నాళ్ల తర్వాత ఆమె ఫోన్ మాత్రం దొరికింది. అందులో ఆమె టైప్ చేసిన మెసేజ్ అలాగే ఉంది. ఈ ఘోరం తర్వాత యాసో తకమత్సు అక్కడికి వెళ్లాడు.

ఏముందని అక్కడ? మొత్తం నీళ్లు, శవాల కుప్పలు, రోదనలు. తన భార్య కోసం వెతకడం ప్రారంభించారు. కనిపించిన ప్రతి శవాన్నీ 'అది నా భార్యదేనా?' అని తరచి చూడటం కంటే ఓ మగవాడికి నరకం ఉంటుందా? కానీ తప్పదు. రోజుల తరబడి వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. ఆమె శవం కూడా కనిపించలేదు. యోకో మరణించి ఉంటుందని, శవం సముద్రంలోకి కొట్టుకుపోయి ఉంటుందని అంతా అన్నారు. కానీ యాసోకు వారి మాటల మీద నమ్మకం లేదు. తన భార్య ఎక్కడో ఉంది, భద్రంగా ఉంది, సముద్రంలోనే మరెక్కడో తన కోసం ఎదురుచూస్తోంది అని అనుకున్నాడు. ఆ నమ్మకాన్ని బలంగా నిలుపుకున్నాడు.

సముద్రంలో ఉన్న భార్యను బయటకు తెచ్చేదెలా? సముద్రంలోకి వెళ్లాలంటే ఈత వస్తే చాలదు. డైవింగ్ తెలియాలి. కఠిన శిక్షణ కావాలి. సవాళ్లు ఎదుర్కోవాలి. అందుకే మసాయోసీ తకహాసీ అనే వాలంటీర్‌ను కలిశారు. సునామీ వల్ల సముద్రంలో చేరిన అనేక భారీ వస్తువులను మసాయోసీ బయటకు తీశారు. సముద్రాన్ని కొంతమేరకు శుభ్రం చేశారు. ఆయనైతే తనకు సాయం చేస్తాడని భావించాడు. ఆయన వద్దే ఉంటూ డైవింగ్ ఎలా చేయాలో, సముద్రంలోకి వెళ్లాక తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో నేర్చుకున్నారు. ఆ తర్వాత కొంతకాలం ఇద్దరూ కలిసి సముద్రంలోకి వెళ్లి వెతికాడు. ఆపైన యాసో ఒక్కడే వెళ్లి తన భార్య కోసం వెతకడం ప్రారంభించాడు.

ఒకటి.. రెండు.. మూడు.. అలా 13 సంవత్సరాలు గడిచిపోయింది. ఆయన ఇంకా వెతుకుతూనే ఉన్నాడు. ఇప్పటికి 600 సార్లు సముద్రంలోకి వెళ్లి వచ్చారు. ఆయన చేస్తున్న పని చూసి చాలామంది అడ్డుచెప్పారు, ఆపాలని ప్రయత్నించారు, పిచ్చిపని అని కొట్టిపారేశారు, ఆమె చనిపోయిందని, ఇక మర్చిపొమ్మని హితవు చెప్పారు. అవేవీ ఆయన వినిపించుకోలేదు. తన భార్య ఇంకా బతికే ఉందని, తన కోసం ఎదురుచూస్తోందని ఆయన నమ్ముతున్నాడు.

న్యూయార్క్ టైమ్స్ ఇంటర్వ్యూలో ఆయన్ని అడిగారు 'ఇంతకాలం ఒక మనిషి కోసం వెతకడం ఇబ్బంది కాదా? ఇంకా ఫలితం లభిస్తుందని అనుకుంటున్నారా?' అని. 'ఇది కష్టమని నాకు తెలుసు. కానీ వృథా అని మాత్రం అనిపించడం లేదు. ఒక భర్త నా భార్య కోసం నేను చేస్తున్న పని ఇది. ఎవరేమనుకుంటే నాకేంటి? ఈ అన్వేషణ నాకు ముఖ్యం. సముద్రంలోకి వెళ్లిన ప్రతిసారీ నా భార్య దొరుకుతుందన్న ఆశతో ఉంటాను. ఆమె దొరక్కపోయేసరికి నిరాశతో బయటకు వస్తాను' అని వివరించారు. ఆయన అన్వేషణ ఇంకా కొనసాగుతూనే ఉంది. నిజంగానే ఆయన భార్య ఆయన కోసం సముద్రంలో నిరీక్షిస్తూ ఉందా? ఏమో? ఎవరికి తెలుసు? భార్య మీద ఇంత ప్రేమ దాచుకున్న మనిషి కోసం ఆమె ఏనాడైనా తిరిగిరావచ్చు.

– విశీ (వి.సాయివంశీ)



'మ్యాడ్' మూవీతో సైలెంటుగా టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చేశాడు జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్. అందులో ముగ్గురు హీరోల్లో ఒకడిగా కనిపించిన నితిన్.. ఇప్పుడు సోలో హీరోగా 'ఆయ్' మూవీ చేశాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్-2 ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేయడం విశేషం. కొత్త దర్శకుడు అంజి.కె.మణిపుత్ర రూపొందించిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:** కార్తీక్ (నార్నె నితిన్) అమలాపురం కుర్రాడు. హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసే అతను.. కరోనా సమయంలో ఇంటి నుంచే పని చేయడం కోసం తన ఊరికి వచ్చేస్తాడు. అక్కడ ఓవైపు పని చేసుకుంటూనే.. తన చిన్న నాటి స్నేహితులైన సుబ్బు (రాజ్ కుమార్ కసిరెడ్డి).. హరి (అంకిత్ కోయ)లతో కలిసి సరదాగా గడిపేస్తుంటాడు. కొన్ని రోజుల తర్వాత కాలేజీ స్టూడెంట్ అయిన పల్లవి (నయన్ సారిక)తో అతను ప్రేమలో పడతాడు. తర్వత పల్లవి కూడా అతణ్ని ప్రేమిస్తుంది. ఇక పెళ్లే తరువాయి అనుకున్న సమయంలో పల్లవికి వేరే అబ్బాయితో పెళ్లిచూపులు అవుతాయి. ఆ పెళ్లికి పల్లవి కూడా ఓకే చెప్పేయడంతో కార్తీక్ షాకవుతాడు. ఇంతకీ పల్లవి మనసు మారిపోవడానికి కారణమేంటి.. ఆమెను దక్కించుకోవడానికి కార్తీక్ ఏం చేశాడు.. చివరికి వీళ్లిద్దరూ కలిశారా లేదా అన్నది మిగతా కథ.

'జాతిరత్నాలు'.. 'మ్యాడ్' సినిమాల్లో మాదిరే ముగ్గురు స్నేహితులు కలిసి చేసే అల్లరే 'ఆయ్'కు ప్రాణం. కాకపోతే ఆ రెండు చిత్రాలతో పోలిస్తే దీన్ని భిన్నంగా నిలిపేది గోదావరి నేపథ్యం. అక్కడి భాష.. యాస.. మనుషుల తీరు మీద దర్శకుడికి మంచి అవగాహనే ఉన్నట్లుంది. అందుకే పాత్రలు చాలా సహజంగా.. వారి మధ్య సంభాషణలు భలే చమత్కారంగా అనిపిస్తాయి. ముగ్గురు కుర్రాళ్ల అల్లరి.. మధ్యలో ఓ అమ్మాయితో హీరో ప్రేమాయణం.. ఈ ప్రేమలో ఓ సమస్య.. దానికి పరిష్కారం.. ఇలా చాలా సింపుల్ లైన్లో నడిచిపోయే సినిమా ఇది.

# మంచి ఎంటర్‌టైనరండీ!

**నటీనటులు:** తన తొలి చిత్రం 'మ్యాడ్'లో నార్నె నితిన్ చాలా సాధారణంగా.. మూడీగా కనిపించాడు. కానీ 'ఆయ్'లో మాత్రం హుషారుగా నటించాడు. తన పాత్ర యూత్ కు బాగా రిలేటయ్యేలా డిజైన్ చేయగా.. నితిన్ అందుకు తగ్గట్లుగా నటించాడు. అతను కామెడీని బాగానే పండించగలిగాడు. లుక్స్.. నటనలో ఈజ్ పరంగా నితిన్ ఇంకా మెరుగుపడాల్సి ఉంది కానీ.. తొలి చిత్రంతో పోలిస్తే మాత్రం చాలా బెటర్ అయ్యాడు. హీరోయిన్ నయన్ సారిక కుర్రాళ్లను కట్టిపడేస్తుంది. 'గం గం గణేశ'లో చాలా మామూలుగా కనిపించిన ఈ అమ్మాయి.. 'ఆయ్'లో మాత్రం అదరగొట్టేసింది. ఎక్స్‌ప్రెసివ్ కళ్లు తన ప్రధాన ఆకర్షణ. సారికకు మేకప్ బాగా కుదిరింది. తన చలాకీ నటన.. మేనరిజమ్స్ ఆకట్టుకుంటాయి. ఇప్పటికే కమెడియన్‌గా రాజ్ కుమార్ కసిరెడ్డికి మంచి పేరున్నప్పటికీ ఈ సినిమా తన కెరీర్‌కు పెద్ద టర్నింగ్ పాయింట్ కావచ్చు. అతను ప్రతి సన్ని వేశంలోనూ నవ్వుల్లో ముంచెత్తేశాడు. మరో ముఖ్య పాత్రలో నటించిన అంకిత్ కోయ సైతం బాగా చేశాడు.. నవ్విం చాడు. హీరోతో కలిసి ఈ ఇద్దరూ చేసిన అల్లరి సినిమాకు మేజర్ హైలైట్. వినోద్ కుమార్.. మైమ్ గోపిల పాత్రల స్క్రీన్ టైం తక్కువే కానీ.. వాటి ఇంపాక్ట్ మాత్రం ఎక్కువే. ముఖ్యంగా వినోద్ కుమార్ క్లైమాక్సులో బాగా హైలైట్ అయ్యా డు. చాన్నాళ్ల తర్వాత ఆయనకు గుర్తుండిపోయే పాత్ర దక్కింది. మిగతా నటీనటులంతా ఓకే.

### కథనం-విశ్లేషణ:

తెలుగు సినిమాల్లో బహుశా ప్రపంచంలో మరే భాషలోనూ కామెడీ వర్ధిల్లి ఉండదు అంటే అతిశయోక్తి కాదు. ఒకే సినిమాలో పది మందికి పైగా కమెడియన్లను పెట్టి నాన్ స్టాప్ కామెడీతో ప్రేక్షకులను ఉక్కిరి బిక్కిరి చేసిన దర్శకులు చాలామందే ఉన్నారు మన తెలుగు సినిమాలో. జంధ్యాల.. ఈవీవీ సత్యనారాయణ.. రేలంగి నరసింహారావు లాంటి ముందు తరం దిగ్గజాల వారసత్వాన్ని తర్వాతి దర్శకులు కూడా చాలా ఏళ్ల పాటు బాగానే కొనసాగించారు. కానీ గత దశాబ్ద కాలంలో మాత్రం తెలుగు కామెడీ ప్రమాణాలు పడిపోతూ వస్తున్నాయి. ఓవైపు కామెడీ డైరెక్టర్లు-రైటర్లు ప్రభావం కోల్పోతూ వస్తే.. మరోవైపు జబర్దస్త్ పుణ్యమా అని సినిమా కామెడీ చెల్లని కాసుగా మారిపోయింది. దీంతో కామెడీ స్టైల్ మార్చుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే 'డంబ్'.. 'కేర్ ఫ్రీ' క్యారెక్టర్లను పెట్టి 'జాలీ'గా అనిపించే కామెడీ చేయడం ఇప్పుడు ట్రెండుగా మారుతోంది. 'జాతిరత్నాలు'.. 'మ్యాడ్' లాంటి సినిమాలు ఈ కోవకే చెందుతాయి. వాటిలో పాత్రలు చాలా వరకు ఎర్రిమాలోకాల్లా అనిపిస్తాయి. అంతే కాక ప్రపంచం ఏమైపోయినా తమ దారి తమదే అన్నట్లుగా కేర్ ఫ్రీ యాటిట్యూడ్ తో నడిచిపోతుంటాయి. ఓవర్ ఎమోషన్లు.. డ్రామా ఏమీ లేకుండా ఫన్నీ యాటిట్యూడ్‌తో నవ్వులు పండిస్తుంటాయి ఈ చిత్రాల్లోని పాత్రలు. 'ఆయ్' కూడా ఆ కోవకు చెందిన సినిమానే. కాకపోతే పైన చెప్పుకున్న చిత్రాలకు భిన్నంగా గోదావరి బ్యాక్ డ్రాప్‌లో.. ఒక పల్లెటూరిలో నడిచే కథ ఇది. రెండు గంటల 20 నిమిషాల నిడివిలో అసలు బోర్ అన్నదే లేకుండా 95 శాతం సినిమాలో నవ్వులు పండిస్తూ.. చివర్లో చిన్న ఎమోషనల్ టచ్ ఇచ్చి మంచి ఫీల్ తో థియేటర్ల నుంచి ప్రేక్షకులను బయటికి పంపిస్తుంది. మామూలుగా ప్రేమకు ప్రధానంగా అడ్డొచ్చేది కులం. ఈ సినిమాలోనూ అంతే. అలా అని ఆ టాపిక్‌ను దర్శకుడు యమ సీరియస్‌గా డీల్ చేసి.. కులం అడ్డుగోడల గురించి క్లాసులేమీ పీకేయలేదు. స్నేహానికి కులం అడ్డు కాదు.. కానీ ప్రేమకు-పెళ్లికి మాత్రం అది అడ్డు కానంతగా సమాజం మారలేదు.. ఎప్పటికీ మారదు కూడా అంటూ కథానాయికతో చాలా వాస్తవికమైన డైలాగ్ చెప్పించాడు దర్శకుడు. అంతే కాక హీరోను తన కులం అనుకుని ప్రేమించి.. అతను వేరే కులం అని తెలుసుకుని.. తనంటే ఇష్టం ఉన్నా సరే తండ్రి ఒప్పుకునే అవకాశం లేదు కాబట్టి.. తేడా వస్తే అతణ్ని చంపించేస్తాడని తెలిసి ఆమె తన ప్రేమను చంపేసుకోవడం కూడా చాలా రియలిస్టిగ్గా కొత్తగా అనిపిస్తుంది. కథల్లో కులం టాపిక్ రాగానే పాత్రలతో ఎక్కడలేని ఆదర్శాలు మాట్లాడించేసి నాటకీయత పెంచేస్తుంటారు దర్శకులు. కానీ ఈ సినిమాలో దర్శకుడు ఆ టాపిక్ ను డీల్ చేసిన విధానం మాత్రం చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది. అదేంటన్నది తెర మీదే చూడాలి. ఇక 'ఆయ్' మూవీకి మేజర్ హైలైట్ అయిన ముగ్గురు ప్రధాన పాత్రధారుల అల్లరి గురించి మాట్లాడాలి. సినిమాకు హీరో నార్నె నితినే కానీ.. కామెడీలో మాత్రం లీడ్ రోల్ రాజ్‌కుమార్ కసిరెడ్డినే. ఇప్పటిదాకా చిన్న చిన్న పాత్రల్లో తన ప్రత్యేకతను చాటుకున్న ఈ టాలెంటెడ్ యాక్టర్.. 'ఆయ్'లో చెలరేగిపోయాడు. పంచుల మీద పంచులు వేస్తూ.. ఒక జోక్‌ను ఎంజాయ్ చేసేలోపే ఇంకోటి వదులుతూ ముగ్గురు మిత్రుల బృందం ప్రేక్షకులను నాన్ స్టాప్ నవ్వుల్లో ముంచెత్తుతుంది. అలా అని సిచువేషన్లు.. సన్నివేశాలు ఏమంత ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఎప్పుడూ చూసే సీన్లే అయినా.. కామెడీ మంచి టైమింగ్ లో సాగిపోవడంతో నవ్వులకు ఢోకా ఉండదు. రొమాంటిక్ ట్రాక్ సైతం సరదాగా.. హాయిగా సాగిపోతుంది. మధ్య మధ్యలో మంచి పాటలు వచ్చిపోతుంటాయి. హీరో లవ్ ఫెయిలయ్యాక కూడా కథను సీరియస్ టోన్లోకి తీసుకెళ్లకుండా లైటర్ వీన్లోనే నడిపించడం 'ఆయ్' ప్రత్యేకత. అందుకే ఎక్కడా కామెడీ టెంపో తగ్గలేదు. చివరి 20 నిమిషాల్లో మాత్రమే వ్యవహారం సీరియస్ అవుతుంది. ఆ కొంత టైంలో దర్శకుడు సింపుల్ సీన్లతోనే ఎమోషన్లను కూడా బాగానే పండించాడు. హీరోకూ ఎందుకూ పనికి రాని వాడిలా కనిపించే అతడి తండ్రి.. తన ప్రేమ సమస్యను ఎలా పరిష్కరించాడన్నది చాలా గమ్మత్తుగా అనిపించే విషయం. ఆ గమ్మత్తేంటో తెర మీదే చూడాలి. ఒక్క సన్నివేశంతో హీరో తండ్రి పాత్ర క్లైమాక్సులో హీరోలా రూపాంతరం చెందింది. మొత్తంగా చాలా వరకు కామెడీగా కథను నడిపించి.. చివర్లో చిన్న ఎమోషనల్ టచ్ ఇచ్చి 'ఆయ్'ని కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ లాగా మలిచాడు దర్శకుడు. కానీ ఈ వీకెండ్ సరదాగా నవ్వుకుని కాల క్షేపంచేయడానికి ఏమాత్రం ఢోకా లేని చిత్రం..ఆయ్. – తుపాకి.కామ్ సౌజన్యంతో..

సాంకేతిక వర్గం: 'ఆయ్' సినిమాలో నాలుగు పాటలుంటే రామ్ మిరియాల.. అజయ్ అరసాల సగం సగం పాటల్ని పంచుకున్నారు. ఇద్దరూ హుషారైన పాటలే అందించారు. అజయ్ నేపథ్య సంగీతం కూడా మంచి ఫ్లోలో సాగింది. సినిమా నడతకు తగ్గట్లే బ్యాగ్రౌండ్ స్కోర్లోనూ ఒక చమత్కారం ఉండేలా చూసు కున్నాడు అజయ్. సమీర్ కళ్యాణి ఛాయాగ్రహణం కూడా ఆకట్టుకుంటుంది. గోదావరి పల్లెటూరి ఫ్లేవర్ విజువల్స్ లో కనిపిస్తుంది. గీతా ఆర్ట్స్ వారి నిర్మాణ విలువలకేమీ ఢోకా లేదు. కథగా వింటే ఏమంత గొప్పగా అనిపించకపోయినా.. కొత్త దర్శకుడి నరేషన్ మీద నమ్మకం పెట్టి ఇలాంటి సినిమా తీయ డంలో నిర్మాతల అభిరుచిని మెచ్చుకోవాలి. ఇక దర్శకుడు అంజి.కె.మణిపుత్రది ప్రామిసింగ్ డెబ్యూ. కామెడీ పండించడం కత్తి మీద సాములా మారిన ఈ రోజుల్లో అతను ఆ పనిని అలవోకగా చేసేశాడు. కొత్త దర్శకుడు అనే ఫీలింగ్ రానివ్వకుండా క్లారిటీతో సినిమా తీసినట్లు అనిపిస్తుంది. మూవీలో ఎక్కడా కృత్రిమంగా అనిపించకుండా సహజంగా జోకులు పేలడం.. నవ్వులు పండడం విశేషం. సినిమా మొత్తంలో ఓ పావు గంట మినహా ఫన్నే ఉంటుంది. దాన్ని ఎంత బాగా డీల్ చేశాడో.. ఆ పావు గంట ఎమోషన్లను కూడా అంతే బాగా వర్కవుట్ చేశాడు అంజి.



# జైలుకైనా వెళతా.. ఇంటికి మాత్రం వెళ్లను!

మగవాడి కష్టం పగవాడికి కూడా రాకూడదని తెలియజెప్పే కథనమిది. 'గృహహింస' అంటే వ్యుత్పత్తి ప్రకారం ఇంట్లో హింస అని. కాకపోతే గృహహింస కేసుల్లో సాధారణంగా భార్యను అత్తమామలు, భర్త వేధిస్తుండేవారు కాబట్టి ఆ మాట అనగానే మహిళలు బాధితులు అన్నంతగా అర్థవ్యాప్తి పొందింది. నిజానికి వ్యుత్పత్తిలో ఆ అర్థం లేదు. కాలం మారింది. ఇప్పుడు గృహహింసకు మగవారు కూడా గురవుతున్నారు కాబట్టి హింసలో సమానత్వం సాధించినట్లే అనుకుని ఒకానొక గృహహింస బాధితుడి కథలోకి వెళదాం.

ఉత్తరప్రదేశ్ లక్నోవాసి విపిన్ గుప్తాకు పెళ్లయింది. దంపతులు భారత ఐటీ కలల రాజధాని బెంగళూరు చేరారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఇద్దరు పిల్లలు పుట్టారు. హాయిగా సాగుతున్న వారి సంసార నౌకలోకి అలజడుల అలలు వచ్చిపడ్డాయి. నౌక నిలువెల్లా కంపించడం మెదలయ్యింది. భార్యలో చంద్రముఖి రెండో ముఖం తొంగిచూసేది. చిత్ర విచిత్రంగా ప్రవర్తించేది. విసుక్కునేది. నోటికొచ్చినట్లు తిట్టేది. చేతికి దొరికిందల్లా తీసుకుని దాడి చేసేది. గిచ్చేది. మీదపడి రక్కేది. శరీరంలో ఓపిక నశించినప్పుడు ఆ పూటకు వదిలిపెట్టి, మళ్లీ కాస్త ఓపిక రాగానే దాడులు మొదలుపెట్టేది. విపిన్ మానసిక శాంతిని బెంగళూరు కాకులెత్తుకుపోయాయి. స్నేహితులకు, బంధువులకు ఎవరికీ చెప్పుకోలేక విపిన్ ఒంటరిగా బైక్ మీద రోజుల తరబడి గమ్యం సినిమాలో శర్వానంద్ వెళ్లినట్లు ఉత్తర భారత్‌లో హిమాలయాల చెంత తిరిగేవాడు. భవిష్యత్తులో వెళ్లాల్సిన హిమాలయాలను ముందుగానే రెక్కీ చేసి చూసుకునేవాడేమో! అలా ఈ నెల మొదట్లో బైక్‌పై ఒంటరిగా వెళ్లిన విపిన్ పదిహేను రోజులైనా తిరిగిరాకపోయేసరికి ఎవరితో గొడవ పడాలో తెలియని భార్య స్థానిక పోలీస్ స్టేషన్లో భర్త ఆచూకీ కోసం కేసు పెట్టింది. వెళ్లే ముందు విపిన్ లక్షా ఎనభై వేలు డ్రా చేసుకుని వెళ్లినట్లు పోలీసులు కనుక్కున్నారు. సెల్‌ఫోన్ వెంట ఉంటే సెల్ టవర్ ఆధారంగా భూ ప్రపంచంలో ఎక్కడున్నా పోలీసులు పట్టుకోగలరన్న కనీస స్పృహ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన విపిన్‌కు ఉంది కాబట్టి ఫోన్ పక్కన పడేశాడు. టోల్‌గేట్ల సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు అతి కష్టం మీద విపిన్‌ను ఢిల్లీ పక్కన నోయిడాలో పట్టుకుని బెంగళూరికి తీసుకొచ్చారు.


**'సార్! మీ కాళ్లు పట్టుకుంటా. నా కష్టం మీకేమి తెలుసు! ఇంట్లో నా భార్య మాటలు పడలేను. ఆ దెబ్బలు తినలేను. దయచేసి నన్ను మా ఇంటికి పంపకండి. కావాలంటే జైలుకు పంపండి. నా భార్య దెబ్బల కంటే నాకు జైలే చాలా భద్రమైన చోటు. పెద్ద మనసుతో, కనీసం సాటి మగవాడిగా నా గుండె గాయాన్ని అర్థం చేసుకోండి!'** అని విపిన్ పోలీసుల కాళ్లు పట్టుకుంటుంటే కఠినాత్ములైన ఖాకీ మగ పోలీసుల కళ్లల్లో కూడా నీళ్లు జలజలా కారి కావేరిలో కలుస్తున్నాయి.

**'నాయనా! నీ బాధ నిజమే కావచ్చు. బొడ్లో పిస్టల్ ఉన్న మేమే మా భార్యల దాడుల నుంచి కాపాడుకోలేక మా బాధలేవో మేము పడుతున్నాము. మగపుట్టుక పుట్టాక ఇవన్నీ తప్పవు. నిన్ను జైలుకు పంపాలంటే నువ్వు నీ భార్యను కొట్టాలి. ఇప్పుడున్న సాక్ష్యాధారాలను బట్టి నిన్ను మీ ఇంటికి పంపి నీ భార్యకు అప్పగించడమే మా విధ్యుక్త ధర్మం. ఆపై ఆమె దయ. నీ ప్రాప్తం!'** అని విపిన్‌ను ఓదారుస్తున్నారు. దాడులను మౌనంగా భరించడానికి మానసికంగా, శారీరకంగా సిద్ధం చేస్తున్నారు!

'మీ ఉత్తర భారతంలో పదాలకు వ్యుత్పత్తి అర్థం సరిగ్గా చెబుతున్నారో! లేదో! మాకు తెలియదు కానీ.. మా దక్షిణ భారతంలో 'భర్త' అంటే 'భరించువాడు' అని స్పష్టంగా వ్యుత్పత్తి అర్థం అనాదిగా చెప్పుకుంటున్నాం. కాబట్టి నువ్ గృహ హింసను భరించాల్సిందే!' అని పోలీసులు తమ పని కాకపోయినా భాషాశాస్త్రవేత్తలనడిగి విపిన్‌కు సర్ది చెబుతున్నారు. 'ఇంటికన్నా గుడి పదిలం – గుడి కన్నా జైలు పదిలం' అన్నవి మాటవరసకు చెప్పుకునే సామెతలే తప్ప నాకు అన్వయమయ్యే సామెతలే లేవా? అని మౌనంగా రోదిస్తున్నాడు విపిన్ ఇంటికి వెళ్లలేక. 'నీ విషయంలో జైలుకన్నా ఇల్లు నరకం' అని సామెతను తిరగరాసుకోవచ్చు అని విపిన్‌కు చెప్పగలిగినవాళ్లమా మనము? ఏ పుట్టలో ఏ పాముందో? ఏ ఇంట్లో ఏ భార్య ఇలా ఉందో? ఎవరికెరుక? 'భారతీయ శిక్షా స్మృతిలో భార్య విధించే శిక్షకు, పెట్టే హింసకు విస్మృతి తప్ప నిష్కృతి లేదా?' అని విపిన్ గుండె పగిలేలా రోదిస్తుంటే బెంగళూరు ఆకాశం కూడా చిల్లు పడి రోదించడం తప్ప ఏమీ చేయలేకపోతోంది!

**గమనిక:– ప్రస్తుతం విపిన్ వయసు 34 ఏళ్లు. విపిన్ భార్య వివరణ మీడియాలో ఎక్కడా రాలేదు కాబట్టి ఇది ఒకవైపు కథనంగానే పరిగణించి ఆమె సమాధానం కోసం నిరీక్షించగలరు. ఆ ఉత్తమ ఇల్లాలి వర్షన్ కూడా విని ఒక నిర్ణయానికి రాగలరు!**

**- పమిడికాల్వ మధుసూదన్**



# విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



(సత్యంన్యూస్, రణస్థలం)

విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగి ఉన్నత విజయాలు సాధించాలని ఎంపీడీవో ఆర్.వి.రమణ మూర్తి సూచించారు. కోస్ట సచివాలయం మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడకుల సందర్భంగా మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఎస్సే రైటింగ్, డిబేటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం మండల అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మోజీ మాట్లాడుతూ వశిష్ఠ స్పోకెన్ ఇంగ్లీష్ వారి సహకారంతో రూ.500 విలువ చేసే మెటీరియల్‌ను విజేతలకు, అతిథులకు అందజేసామన్నారు.

**విశ్వభారత్ వీర పురస్కార్ గ్రహీతకు అభినందన**

ఈనెల 15న స్వాతంత్ర్య సమరయోధులు, మిలిటరీ జవాన్లు, సేవా రంగం, రచనా రంగంలో అతి తక్కువ మందికి ఇచ్చే విశ్వభారత్ వీర పురస్కార్ అవార్డును విశాఖపట్నంలో మహిళా పోలీస్ అమ్మోజీ బమ్మిడి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపీడీవో ఆర్.వీ.రమణమూర్తి, ఏవో వి.ధనుంజయరావు, సీడీపీవో ఝాన్సీ, ఏఎస్ఐ సిహెచ్ లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు ఆర్.శ్రీధర్, వి.చంద్రశేఖర్, హైదర్ అలీ సోమవారం ఘనంగా సత్కరించారు. వృత్తితో పాటు ప్రవృత్తిలోనూ రాణిస్తున్న అమ్మోజీ భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన ఆమె కోస్ట సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తెలుగు తేజం, శ్రీశ్రీ ప్రతిభా పురస్కారం, సేవారత్న తదితర జాతీయ పురస్కారాలను అందుకోవడంతో పాటు 48 గంటల కళాకారుల ప్రదర్శన ఏర్పాటు చేసి నాలుగు వరల్డ్ రికార్డుల్లో ఆమె పేరు నమోదు చేసుకున్నారు. కార్యక్రమాల్లో కొండములగాం మోడల్ స్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కోస్టా, వీ.ఎన్.పురం తదితర పాఠశాలల యాజమాన్యం కొండములగం వెల్ఫేర్ అసిస్టెంట్ గణపతి పాల్గొన్నారు.



# మెగా అభిమానుల రక్తదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకొని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో రవణం స్వామినాయుడు, మహేష్ పిలుపు మేరకు శ్రీకాకుళం జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆదివారం గాంధీపార్క్ దరిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదానం చేసింది. సీనియర్ ఫ్యాన్స్ ఫౌండర్ పాలకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వంజరాపు రాము చేతులమీదుగా మెగా ఫ్యాన్స్ రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు రక్తదాతలకు షీల్డ్ ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పైడి శ్రీనివాస్, నరసింహం, సత్యనారాయణ, జిలానీ, కింతాడ సంతోష్, అప్పారావు, గిరి, హుస్సేన్, వురిటి సునీల్‌కుమార్, సూర్య, పవన్, పోస్ట్‌మాన్ శ్రీనివాసరావు, రామారావు, జల్లేపల్లి రామరావు, మెగాభిమానులు పాల్గొన్నారు.

# వేడుకగా జనసేన జెండా ఆవిష్కరణ



(సత్యంన్యూస్, రాజాం)

జనసేనపార్టీ జండా ఆవిష్కరణ వేడుకలను బొమ్మినాయుడువలస గ్రామంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. జనసేన పార్టీ జండా వేడుకల సందర్భాన్ని పురస్కరించుకొని జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ ముఖ్య అతిదిగా హాజరై జనసేన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భారతదేశ రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన ఏకైక నాయకుడని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతీ గ్రామం, పట్టణం, వార్డుల్లో జనసేన జెండా ఆవిష్కరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రచారకమిటీ సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్ బాబు, రాజాం మండలపార్టీ అధ్యక్షులు గార శివరాం, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శిలు సైలాడ జగదీశ్, కొంచాడ చిన్నంనాయుడు, రాజాం మండల ఉపాధ్యక్షులు లంక అన్నంనాయుడు, రాము, రాజాం మండల సంయుక్త కార్యదర్శి పాతినవలస వినోద్, రాజాం నియోజకవర్గ నాయకులు కెల్ల సూర్యనారాయణ, ప్రవీణ్, గార ఎర్రన్నాయుడు, డబ్బాడ క్రిష్ణ, బొమ్మినాయుడువలస గ్రామ జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ధ్యానంతో ఆత్మశుద్ధి: ఎమ్మెల్యే శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మనసును ఆధీనంలో ఉంచడం, జీవితాన్ని ఆనందమయం చేసుకోవడం, ఆత్మశుద్ధి ధ్యానంతోనే లభిస్తాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద నుంచి 7 రోడ్ల కూడలి వరకు ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి బిందు మాధవి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర మెగా శాకాహార సద్భావన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ అందరూ బుద్ధితో జీవనం కొనసాగించడమే ధ్యానమని పేర్కొన్నారు. పత్రిజీ పిరమిడ్ ద్వారా సహజసిద్ధమైన యోగా చేసుకోవచ్చన్నారు. పిరమిడ్ ధ్యానం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని చెప్పారు. తాను ప్రతీరోజూ ధ్యానం, ప్రాణయామం, సుదర్శనక్రియ చేస్తానని, దీనివలన చెడు ఆలోచనలు మనసులోకి రావని వివరించారు. కార్యక్రమంలో ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షులు రాయ్ జగపతిరాజు, బిందు మాధవి, పీఎంసీ డైరక్టర్ సిద్ధా నాగేశ్వరరావు, ఇస్కాన్ ప్రభు శ్రీనివాస గోవిందతో పాటు బాలాజీరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



# హంతక రేపిస్టులను కఠినంగా శిక్షించాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై సామూహిక అత్యాచార ఘటన జరిగి 10 రోజులు గడిచినా నేరస్తులందరినీ గుర్తించి శిక్షించడంలో పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి కొనసాగుతోందని, అత్యాచారం, హత్య జరిగినప్పటికీ ప్రభుత్వం, పోలీసు వర్గాలు చర్యలు తీసుకోకపోవడం దారుణమని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) తీవ్రంగా నిరసించింది. ఈమేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాగిన ర్యాలీని ఉద్దేశించి పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సవలాపురపు కృష్ణవేణి, పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ మహిళలపై దేశవ్యాప్తంగా నిరంతరం సాగుతున్న అత్యాచారాలకు గల మూల కారణాలను తొలగించడానికి పాలకులు ఎలాంటి ప్రయత్నాలూ చేయడం లేదని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసలకు మూల కారణాలైన మద్యం, పోర్న్ వీడియోలను, అశ్లీల చిత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాలని వారు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. నిరసనలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు హేమక్క, జానకమ్మ, అప్పన్నమ్మ, పలు ప్రజా సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్, సన్నశెట్టి రాజశేఖర్, గొరకల బాలకృష్ణ, సార జగన్, గోపి, మల్లిబాబు, మాధవరావు, అప్పయ్య, అప్పారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చేసేది చీటింగ్.. రాజకీయ ఫైటింగ్!

**మొదటిపేజీ తరువాయి**

పేరుతో అప్పనంగా పింఛను పొందుతున్నట్టు గుర్తించారు. వారు సమర్పించిన ధ్రువపత్రాలు తప్పుడువని వైద్యాధికారులు నిర్ధారించినా మండల అభివృద్ధి అధికారి మాత్రం వారిని రక్షించే ప్రయత్నం చేస్తునే ఉన్నారు. ఇప్పటికి ఐదుసార్లు ఫిర్యాదులు అందినా ఎంపీడీవో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి ఉందంటూ ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేసేస్తున్నారు. పింఛన్లు నిలిపివేయకుండా ప్రతి నెల మొదటి వారంలో నోటీసులు ఇచ్చి ఆ నెల 20 తర్వాత విచారణకు హాజరుకావాలని కోరుతున్నారు. దీంతో ప్రతి నెల ఒకటిన పింఛను ఇవ్వడానికి అవకాశం ఏర్పడుతోంది. 21వ తేదీ దాటిన తర్వాత పింఛను నిలిపివేయడానికి గానీ, కొత్తగా పేర్లు చేర్చడానికి అవకాశం ఉండదు. ప్రతి నెలా 21వ తేదీ లోగానే సచివాలయాలవారీగా లబ్ధిదారుల జాబితాలను డీఆర్‌డీఏ ద్వారా సెర్ఫ్ సీఈవోకు పంపిం చేస్తారు. అందువల్ల 21వ తేదీ తర్వాత ఈ ప్రక్రియలో ఎవరూ చెయ్యి పెట్టలేరు. దీన్ని ఆసరా చేసుకొని ఎంపీడీవో టెక్నికల్‌గా నకిలీ దివ్యాంగులకు పింఛన్లు నిలిచిపోకుండా చూస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనికి అనుగుణంగానే నోటీసులు ఇవ్వడం, జాబితా తయారు చేయడానికి ఒకరోజు ముందు డీఆర్‌డీఏ అధికారులతో సంప్రదింపులు జరపడం చేస్తున్నారు.

**కాలహరణంపై కలెక్టర్ ఆగ్రహం**

ఇబ్రహీంబాద్‌లో దివ్యాంగుల పేరుతో పింఛన్లు అందుకుంటున్న 11 మందిపై ఆరోసారి గత నెల 22న ఫిర్యాదు అందగా, వారికి వైద్య పరీక్షలు చేసి సదరం పత్రాలు పరిశీలించాలంటూ ఈ నెల ఎనిమిదో తేదీన రిమ్స్ అధికారులకు ఎంపీడీవో లేఖ రాశారు. దీనిపై స్పందించిన రిమ్స్ వైద్యులు ఈ నెల 28న పరీక్షలకు హాజరు కావాలంటూ 11 మందికి నోటీసులు ఇచ్చారు. ఇన్ని రోజులు నాన్చడానికి కారణం సెప్టెంబర్‌లో 11 మందికి పింఛను ఇవ్వాలన్న ఆలోచన చేయడమేనని ఫిర్యాదుదారుడు ప్రకాశరావు ఆరోపిస్తున్నారు. అధికారుల బాధ్యతారాహిత్యంపైనా ఈ నెల 12న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రిమ్స్ అధికారులకు చీవాట్లు పెట్టడంతో ఈ నెల 28న నిర్వహించాల్సిన ధ్రువపత్రాల పరిశీలనను వారం ముందుకు జరిపి 20వ తేదీకి మార్చి నోటీసులు ఇచ్చారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ సీరియస్‌గా ఉండడం, గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కారణంగా మరో 9 మందిపై కూడా ఫిర్యాదు రావడంతో వారిని కూడా ఈ నెల 20న నిజనిర్ధారణకు హాజరుకావాలని గ్రామ కార్యదర్శి ద్వారా నోటీసులు అందించారు.

**పోటీ ఫిర్యాదులతో పెరుగుతున్న అనర్హులు**

గత నెల 22న ఎస్వీ రమణ పేరుతో లక్ష్మణకుమార్ అనే వ్యక్తి కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో మొదలవలస రమణ, చింతాడ వాసుదేవరావు, సనపల వెంకటగజవరదారావు, కిల్లి పెంటమ్మ, సువ్వారి వెంకట రమణ, చింతాడ అప్పలనాయుడు, సీపాన శ్రీరామ్మూర్తి, కంచరాపు తేజేశ్వరరావు, పైడి రామారావులను నకిలీ లబ్ధిదారులుగా పేర్కొన్నారు. వీరిలో సువ్వారి వెంకటరమణ, మొదటి ఫిర్యాదులో ఉన్న 11 మంది జాబితాలోనూ ఉన్నాడు. వీరితో పాటు మరో ముగ్గురు సీపాన కృష్ణమూర్తి, సూర రామారావు, సీపాన నాగరాజు దివ్యాంగులుగా సదరం సర్టిఫికెట్ పుట్టించి పింఛను పొందుతున్నట్టు గ్రామంలో చర్చ జరుగుతోంది. వీరిపైనా ఫిర్యాదు చేయడానికి ప్రత్యర్థి వర్గం సిద్ధమవుతోంది. దీంతో మొత్తం 44 మంది దివ్యాంగ పెన్షనర్లలో 22 మంది బోగస్ లబ్ధిదారులేనని అర్థమవుతోంది. వీరితో పాటు వృద్ధాప్య, ఒంటరి మహిళా పింఛన్లు అందుకుంటున్నవారిలోనూ ఆధార్ కార్డులో వయసు, రేషన్ కార్డుల్లో కుటుంబ వివరాలు మార్చి పింఛన్లు పొందుతున్న వారు ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు పరీక్షించి నివేదిక ఇచ్చిన తర్వాత మండల అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.










## మూలపేట.. జిల్లాకు మేలుబాట!

మొదటిపేజీ తరువాయి

వెల్లడించింది. స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. రాష్ట్రంలో రానున్న రోజుల్లో పలు ప్రాంతాల్లో పారిశ్రామిక హబ్‌లు ఏర్పాటు చేస్తామని చెబుతూ వాటిలో ఒకటి శ్రీకాకుళం జిల్లా మూల పేటలో ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లను మూలపేట హబ్‌లో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

**రిఫైనరీ కూడా వచ్చే ఛాన్స్**

వీటితో పాటు మరో జాక్‌పాట్ తగిలే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. అదే భారీ పెట్రోలియం రిఫైనరీ. మన రాష్ట్రంలో ఒక్క విశాఖలోనే హెచ్‌పీసీఎల్ పెట్రో రిఫైనరీ ఉంది. విశాఖ అభివృద్ధిలో దాని పాత్ర ఏమిటో కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అటువంటి భారీ పరిశ్రమే మన జిల్లాకు ప్రత్యేకించి మూలపేటకు వచ్చే ఛాన్స్ ఉంది. దేశంలో ప్రముఖ ప్రభుత్వరంగ పెట్రోలియం సంస్థ అయిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) తన విస్తరణ కార్యకలాపాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీ రిఫైనరీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. రూ.60వేల కోట్లతో ఏటా 12 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించే ఈ రిఫైనరీకి ప్రధానంగా మూడు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. మచిలీపట్నం, రామయపట్నం, మూలపేట పోర్టు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. పోర్టులకు సమీపంలో భూముల రేట్లు అధికంగా ఉండటం వల్ల భూసేకరణకే పెద్దమొత్తం వెచ్చించాల్సి ఉంటుంది. మరోవైపు రామయపట్నం అంత అనుకూలంగా ఉండదని, ఈ రెండింటితో పోలిస్తే మూల పేటలో భూసేకరణ తక్కువ వ్యయం కావడంతో పాటు జాతీయ రహదారి, ప్రధాన రైల్వేలైన్ సమీపంలోనే ఉండటం.. అలాగే పక్కనే ఒడిశా రాష్ట్రం కూడా ఉండటం వల్ల మూలపేట ప్రాంతమే పెట్రో రిఫైనరీ నిర్మాణానికి పూర్తి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

**రాజకీయంగానూ అనుకూలతలు**

ప్రతిపాదనలు తెరపైకి రావడంతో పాటు వాటిని సాకారం చేయాల్సిన రాజకీయ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాపై ప్రత్యేకంగా శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇక రాష్ట్రంలో సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు తన నియోజకవర్గంలోనే ఉన్న మూలపేట ప్రాంతంలో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టులను కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కేంద్రంలో కేబినెట్ మంత్రిగా ఉన్న శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర ప్రభుత్వపరంగా కాగల కార్యాలను శీఘ్రం పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరంతా కలిసికట్టుగా కృషి చేస్తే.. అన్నీ అనుకూలిస్తే మూలపేట.. తద్వారా శ్రీకాకుళం ముఖచిత్రం వెలిగిపోవడం ఖాయమన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. వలసల జిల్లా అన్న పేరును చెరిపేసుకుని ఉపాధి ఖిల్లాగా సిక్కోలు ఉన్నత స్థానానికి చేరుతుంది.



పవిత్ర రక్షా బంధనం సందర్భంగా బ్రహ్మకుమారీస్ మబగాంలోని మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌కు, పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్యలకు వారి నివాసంలో సోమవారం రక్షా బంధనం కట్టి శుభాకాంక్షలు తెలిపారు. **– సత్యంన్యూస్, పోలాకి**



రాఖీపౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీకాకుళం నగర పరిధిలోని మెడికవర్ హాస్పిటల్‌లో ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్‌కు రాఖీకట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న ఓం శాంతి బ్రమ్మకుమారిలు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## జ్ఞాపకాల పందిరిలో.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**(సత్యంన్యూస్, పొందూరు)**

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1968–69లో హయ్యర్ సెకండరీ పన్నెండో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 55 ఏళ్ల సుదీర్ఘ కాలం అనంతరం ఇక్కడి సిస్టం డిగ్రీ కళాశాల (అంబేద్కర్ వర్సిటీ అనుబంధం)లో జరిగిన ఈ సమావేశానికి పూర్వ విద్యార్థి డాక్టర్ మందుల మోహనరావు అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులు పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకుని ఆనందానుభూతి పొందారు. మృతిచెందిన ఉపాధ్యాయులు, సహాధ్యాయులను గుర్తు చేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. లయన్ వడ్డిపల్లి సూర్యనారాయణ, ఎం.వెంకటరావు, బలివాడ రామ్మోహనరావు, కె.వి.రమణారావు, బల్ల సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. కుటుంబాలతో సహా వీరంతా హాజరు కావడం విశేషం. 2026లో కూడా ఈ తరహా సమావేశాన్ని జరిపేందుకు నిర్ణయించారు.





సోదర సోదరీమణుల ప్రేమకు ప్రతిరూపంగా జరుపుకునే రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాలకొండలోని తన సోదరుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. **– సత్యంన్యూస్, పాతపట్నం**

## నైతిక విలువలు నేర్పేది సాంఘిక శాస్త్రమే

**(సత్యంన్యూస్, టెక్కలి)**

నైతిక విలువలు నేర్పేది సాంఘిక శాస్త్రమేనని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అన్నారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పాఠశాల సముదాయ సమావేశం బోరుభద్ర జెడ్పీ హైస్కూల్‌లో జరిగింది. మొదటిగా కోల్‌కతాలో వైద్య విద్యార్థిని మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పిల్లల్లో నైతిక విలువలు నేర్పి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేది సాంఘిక శాస్త్రమని అన్నారు. పాఠశాల సముదాయ కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ ఆధునిక బోధనా పద్ధతుల ద్వారా సాంకేతికతను జోడించి ప్రతి ఉపాధ్యాయుడు బోధించాలని సూచించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. సాంఘిక శాస్త్రంలో నూతన పోకడలను ఉపాధ్యాయులు కె.తవిటిరెడ్డి, విష్ణు, బి.పాపారావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.చందనరావు, ఎస్.రామారావు, కె.లక్ష్మీనారాయణ, జనార్ధనరావు, తిరుమలరావు, సుజాత, గిరిజా లక్ష్మీ, రెండు మండలాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట

**2028కి రాష్ట్రంలో నేషనల్ గేమ్స్ నిర్వహిస్తాం**
**2036కి దేశంలో ఒలింపిక్ పోటీల నిర్వహణే లక్ష్యం**
**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేస్తున్నాయని, క్రీడాభివృద్ధే లక్ష్యంగా సన్నాహాలు ప్రారంభించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గుజరాత్‌లో రాజకీయ స్థాయి క్రీడాకారులు నిర్వహించారని, 2028లో ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ గేమ్స్ నిర్వహించడానికి సీఎం చంద్రబాబునాయుడు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో క్రీడా అకాడమీలు ప్రారంభించి రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా మార్చాలన్నదే చంద్రబాబు విజన్ అని చెప్పారు. భారతదేశానికి కలగా మిగిలిన ఒలింపిక్ క్రీడల నిర్వహణ 2036కి దేశంలో నిర్వహించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ తన ఆలోచనలను ముందుకు తీసుకువెళ్తున్నారని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు పొందిన తర్వాతే ఆయా క్రీడాకారులకు గుర్తింపు ఉంటోందని, అప్పడే వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారని, క్షేత్రస్థాయి నుంచే సరైన సౌకర్యాలు కల్పిస్తే వారి ప్రతిభా పాటవాలు వెలుగు చూసి క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ చిన్నారులను క్రీడల పట్ల మక్కువ కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా బాలుర, బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన విజయనగరం జట్టుకు, బాలుర విభాగంలో రన్నరప్‌గా నిలిచిన శ్రీకాకుళం, బాలికల విభాగంలో రన్నరప్‌గా నిలిచిన గుంటూరు జట్టుకు బహుమతులను అందజేశారు. బాలికల విభాగంలో శ్రీకాకుళం జట్టు మూడో స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, సూర శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్టాఫ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫొటోగ్రాఫర్స్ డే

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

లూయిస్ డాగురె మండేలా 185వ జన్మదినం సందర్భంగా సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నటరాజ్ ఫోటో ఎంపోరియంలో పట్టణ అధ్యక్షులు పక్కి వేణు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు, ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ పూర్వ అధ్యక్షులు మెట్ట నాగరాజు మాట్లాడుతూ డాగురే ఫోటోగ్రఫీకి ఎనలేని సేవ చేసిన వ్యక్తిగా తరతరాలు నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ ఫోటోగ్రాఫర్లు, ఎచ్చెర్ల మండలం ఫోటోగ్రాఫర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## ఆడపిల్ల పట్ల సోదరి భావంతో మెలగాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సమాజంలో ప్రతి ఆడపిల్ల పట్ల సోదరి భావంతో మెలగాలని, తద్వారా వారిపై విద్వేషాలు, అఘాయిత్యాలు తగ్గుముఖం పడతాయని లయన్స్ క్లబ్స్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సోమవారం నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లోని సన్‌రైజ్ హాస్పిటల్ వద్ద క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కోల్‌కతాలోని మహిళా ట్రైనీ డాక్టర్ పట్ల జరిగిన అఘాయిత్యాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, డాక్టర్ బాడాన దేవభూషణరావు, ట్రెజరర్ భారతి, సభ్యులు టి.రాంగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ సీపాన రమేష్ కుమార్, ఉర్లం శివతేజలు పాల్గొన్నారు.



## హ్యాపీనెస్ కోర్స్ ముగింపోత్సవం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పాన్ ఆఫ్ ఇండియాలో భాగంగా గత ఆరు రోజులుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ సెంటర్‌లో జరుగుతున్న (ఆనందోత్సవం) హ్యాపీనెస్ కోర్స్ ముగిసింది. జీవితంలో సాధన (యోగా), సేవ, సత్సంగం అనేవి ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని రవిశంకర్ గురూజీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా పిలుపునిచ్చారు. ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు మాట్లాడతూ ఆనందంతో సంబంధాలను, సంతోషాలను పొందవలసిన మనిషి అహంతో దూరం చేసుకొంటున్నారని అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ దేసూళ సురేంద్ర యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, సుదర్శన క్రియ చేయించారు. యోగా టీచర్లు, డాక్టర్ అమ్మన్నాయుడు, సురేంద్ర–కాత్యాయని దంపతులను, వారణాసి సందీప్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యోగా టీచర్స్ కింతలి గోవింద్, వారణాసి సందీప్, మీడియా కో–ఆర్డినేటర్ కేఎస్ఎన్ మూర్తి, వాలంటీర్లు శశిభూషణరావు, టి.అప్పారావు, వెంకటప్పరావు, కాత్యాయని, శిమ్మ ఠాకూర్ దాస్, ఆదిత్య, 55 మంది వరకు సాధకులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సత్సంగంలో ఠాకూర్ దాస్, సింహాద్రి శ్రీనివాస్, స్పీడ్ జి.సురేష్ బృందం పాడిన భక్తిభజన గీతాలు, పాటలు ఆసాంతం ఆకట్టుకున్నాయి.



## ఘనంగా నవనాగ విగ్రహాల ప్రతిష్ఠ

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



చినబొందిలీపురం బాయమ్మతోటలోని సఖియామఠంలో గల శ్రీ సంజీవరాయ స్వామి ఆలయంలో నవ(9) నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. గుమ్మా గణేష్, వారి శిష్య బృందం నేతృత్వంలో విశేష పూజలు, హోమాల అనంతరం కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు, దయంత్రి శ్రీకాంత్, సునీత దంపతులు ప్రధాన నాగబంధం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనం తరం అష్టనాగ విగ్రహాలను రెడ్డి హయగ్రీవ హన్షిత్, కొండపల్లి హన్విత్తా భ్రామరి, మొదలవలస షన్ముఖసాయి, కూసంపూడి సుజా త, బోను మద్దెల శ్రీనివాసరావు, కొండదాడి పుష్పాదేవి, సాధు ఉమామహేశ్వరరావు, దయంత్రి అమృతవల్లి ప్రతిష్ఠించారు. కార్యక్ర మం అనంతరం 600 మందికి అన్నప్రసాద వితరణ జరిపించారు. ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రదాస్, వడగ జగదీశ్వరి, ప్రధానార్చకులు ఈవీ ప్రశాంత్ శర్మ, విశ్వజయము గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుణ్యపు కూర్మారావు, సభితాలక్ష్మి రూ.10వేలు, కోడి బాలకృష్ణ, లక్ష్మి రూ.10వేలు, సాధు ఉమామహేశ్వరరావు, సీతారాములు రూ.10వేలు, ఆలయ నిర్వాహకులు కాశినకు అందించారు.

## విద్యార్థుల వినూత్న ప్రదర్శన

**(సత్యంన్యూస్, పలాస)**

రాఖీపూర్ణిమ సందర్భంగా పలాసలోని సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణాపురం విద్యార్థులు చేసిన వినూత్న ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అన్నాచెల్లెళ్ల మధ్య ఐకమత్యాన్ని, విద్యార్థుల్లో సోదరభావాన్ని చాటిచెప్పే రీతిలో రాఖీ రూపంలో విద్యార్థులంతా కూర్చుని ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థులను చైర్మన్ మల్ల రామేశ్వర్ గౌడ్, ప్రిన్సిపల్ ప్రీతి చౌదరి అభినందించారు. అనంతరం విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు.



## నాలుగు లైన్ల రోడ్లుగా అభివృద్ధి చేయండి

**(సత్యంన్యూస్, విజయనగరం)**



రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్, ప్రజల అవసరాలు, ఆధ్యాత్మిక టూరిజం, అంతర్ రాష్ట్ర సంబంధాలు, గిరిజన ప్రాంతాలకు నూతనంగా రోడ్డు మార్గాన్ని కల్పించే విధంగా ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ ప్రధానంగా నాలుగు రోడ్లను నాలుగు లైన్ల రోడ్లుగా అభి వృద్ధి చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు ఆదివారం ప్రతిపాదనలను అందజేశారు. ముఖ్యంగా విజయనగరం నుంచి వయా చీపురుపల్లి, రాజాం, పాలకొండ, కొత్తూరు, పర్లాకిమిడి, మెలియాపుట్టి, చాపర మీదుగా పలాస వరకు సుమారు 160 కిలోమీటర్ల పొడవునా నాలుగు లైన్ల రోడ్డును అభివృద్ధి చేయాల్సిందిగా ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు అందజేసినట్టు అప్పలనాయుడు వివరించారు. అలాగే రామభద్రాపురం నుంచి రాజాం, పొందూరు, చిలకపాలెం వరకు గల సుమారు 60 కిలోమీటర్ల రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని సీఎంకు కోరినట్టు అప్పల నాయుడు వివరించారు. నెల్లిమర్ల జంక్షన్ నుంచి రామతీర్థం, రణస్థలం వరకు గల రోడ్డును కూడా నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని కలిశెట్టి తెలిపారు. త్వరితగతిన ఇవే రోడ్లు అభివృద్ధి పనులను చేపట్టేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు.

## ప్రాణాలు పోసే ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించండి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రజలకు సేవలను అందించే ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతా యువ వైద్యురాలిపై అకృత్య ఘటనతో దేశమంతా కంపిస్తోందని, పనిచేసే చోట మహిళలకు కనీస భద్రత లేకపోతోందని, బాలికలు, మహిళా రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా, అమలులో ఉదాశీన వైఖరి కారణంగా చట్టాలు నీరుగారుతున్నాయని విమర్శించారు. కోవిడ్ వారియర్స్ అని పొగిడి సత్కారాలు చేసిన వైద్యులకు ఆసుపత్రుల్లో భద్రత ఎంతనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రభుత్వ కార్యాలయాలలో, మహిళా ఉద్యోగులు పని చేస్తున్న ప్రదేశాల్లో ఉమెన్ ఫ్రెండ్లీగా ఉందా లేదా అనేది చూడాలని, మహిళా ఉద్యోగులు రాత్రి పూట విధులు నిర్వహించే సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక అమరిక కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనిచేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని, లిఫ్ట్‌ల్లోనూ సీసీ కెమెరాలు తప్పనిసరి చేయాలని కోరారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టం అమలులో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తోందని సాయిరాం, శ్రీనివాసరావు ఆరోపించారు. మహిళలు పనిచేసే ప్రతిచోట ఇంటర్నల్ కంప్లెయింట్ కమిటీ, లోకల్ కంప్లెయింట్ కమిటీలు ఉండాలని, డ్యాష్‌బోర్డు నిర్వహించాలని, షీ బాక్స్‌లు అన్నిచోట్లా ఉండాలనే నిబంధన పెట్టాలని, పోష్ చట్టం అమలుకు ప్రత్యేక బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించి చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.